


https://www.tholikranthidaily.in TEL TEL - 12281

# తొలిక్రాంతి

మన గొంతుకే.. మన పత్రిక

తెలుగు దినపత్రిక..

హైదరాబాద్
మంగళవారం
9-9-2025

వెల: రూ.4/-
సంపుటి: 01 సంచిక: 40
పేజీలు: 04

Published From: Hyderabad

Editor: Malothu ChandraKala







## కడుపులో విషం పెట్టుకుని

# ప్రాజెక్టులు ఆపొద్దు

- ప్రాజెక్టులకు రాజకీయాలకు అతీతంగా సహకరించాలి
- ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా మూసీ నదిని ప్రక్షాళన చేస్తాం
- మురికికూపంగా మారిన మూసీని శుభ్రపరచి నల్గొండతో పాటు పరిసర ప్రాంతాలకు ఉపశమనం కల్పిస్తాం
- దాదాపు ₹7,360 కోట్ల వ్యయంతో రెండేళ్లలో ప్రాజెక్టు పూర్తి చేయాలన్న లక్ష్యం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- గోదావరి తాగునీటి సరఫరా పథకంకు శంకుస్థాపన

హైదరాబాద్, సెప్టెంబర్ 8-(తొలి క్రాంతి):

రాబోయే పదేళ్లలో హైదరాబాద్‌ను అద్భుతమైన నగరంగా తీర్చిదిద్దడమే కాకుండా లక్షలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. జంట నగరాలను ప్రపంచ నగరాల్లో మేటిగా తీర్చిదిద్దేందుకు మూడు నెలల్లో ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ఈ అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ అండగా నిలబడాలని, కలిసి ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. హైదరాబాద్‌కు ప్రతి ఏటా 3శాతం ప్రజలు వలసలు వస్తున్నారని, నగరం కోటిన్నర జనాభాకు పెరిగే తరుణంలో దీర్ఘకాలిక ప్రణాళికలు అత్యవసరమని ముఖ్యమంత్రి చెప్పారు. పెరుగుతున్న నగర అవసరాలకు కృష్ణా జలాలు సరిపోకపోవడంతో, గోదావరి మిగతా 2లో..

## 100 రోజుల్లో మేడారం జాతర పనులు పూర్తి చేయాలి

- ఆలయ నిర్మాణాలకు సహజ రాతి నిర్మాణం
- జంపన్న వాగులో నీటిని నిలుపుకోవడానికి చెక్ డ్యామ్‌లు
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

2

## కాళేశ్వరం తెలంగాణకు

# కల్పతరువు

- కాళేశ్వరం మీద విచారణ చేస్తూనే అదే నీళ్లతో ప్రాజెక్టులకు శంకుస్థాపన
- ఎన్నికల ముందు ప్రాజెక్టును బద్నాం చేశారన్నారు
- ప్రమాదాలకు కారణమైన కాంట్రాక్ట్ కంపెనీలకు పనులు ఇచ్చి వేల కోట్ల దోపిడీకి కుట్ర
- కేసీఆర్, బీఆర్ఎస్ మాత్రమే హైదరాబాద్‌కు న్యాయం చేయగలరు
- 10 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరారని చెప్తూ.. పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ అప్రూవర్‌గా మారిపోయాడు
- హైదరాబాద్‌కు 24గంటలు తాగునీరందించే బాధ్యత మాది
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్




హైదరాబాద్, సెప్టెంబర్ 8-(తొలి క్రాంతి):

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు సీఎం రేవంత్‌రెడ్డిపై తీవ్రంగా విరుచుకుపడ్డారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ పార్టీ ప్రారంభం నుంచే విషప్రచారం చేసిందని విమర్శించారు. ఎన్నికలకు మూడు నాలుగు సంవత్సరాల ముందు నుంచే అడ్డమైన ఆరోపణలతో ప్రజల్లో అనుమానాలను కలిగించి, ప్రాజెక్టును బద్నాం చేసినట్లు పేర్కొన్నారు. ప్రజాధనం ఖర్చుచేసి పత్రికల్లో ప్రకటనలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, మల్లన్నసాగర్ నుంచి నీళ్లను తీసుకొచ్చి మూసీకి పునరుజ్జీవాన్ని తీసుకొస్తామని చెబుతూనే, అదే కాళేశ్వరం ప్రాజెక్టుపై సీబీఐ విచారణకు ఆదేశించడం ద్వంద్వ వైఖరిని సూచిస్తోందని విమర్శించారు. రాహుల్ గాంధీ అనునిత్యం విమర్శించే కేంద్ర దర్యాప్తు సంస్థలైన సీబీఐ, ఈడీలతోనే కాళేశ్వరం మీద విచారణ జరపడం ద్వేషపూరిత వైఖరిని చూపుతుందని మండిపడ్డారు. రూ.కోట్లు గంగలో కలిపినట్లు, 22 నెలల పాటు విచారణ జరిపినా కొండను తవ్వి ఎలుకను కూడా పట్టలేదని, ఘోష్ కమిషన్‌తో ఏమీ సాధించలేదని ఆయన ఎద్దేవా చేశారు. ఇవాళ మల్లన్న సాగర్, మూసీ నదుల అనుసంధానానికి శంకుస్థాపన చేస్తున్న సీఎం, ఇదే ప్రాజెక్టును గతంలో విఫలమని ప్రచారం చేశారని కేటీఆర్ గుర్తుచేశారు. "కాళేశ్వరం అంటే బ్యారేజ్ కాదు, మిగతా 2లో..



2

## మొదటి ఓటు మోదిదే

- ఎన్డీయే అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్, ఇండియా కూటమి అభ్యర్థి సుదర్శన్‌రెడ్డి మధ్య ముఖాముఖీ పోరు
- జగ్‌దీప్ ధన్‌ఖడ్ రాజీనామాతో ఉపరాష్ట్రపతి పదవికి ఎన్నిక అవసరం

# ప్రాణహిత-చేవెళ్లకు ప్రాధాన్యత

- తుమ్మిడిహెట్టి బ్యారేజీ ప్రతిపాదనలు సిద్ధం చేయాలి
- మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణకు స్పష్టమైన చర్యలు
- వచ్చే వానాకాలం లోపు పనులు పూర్తి చేయాలని ప్రణాళికలు రూపొందించాలి
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



హైదరాబాద్, సెప్టెంబర్ 8-(తొలి క్రాంతి):

రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సోమవారం జలసౌధలో నిర్వహించిన నీటిపారుదల శాఖ సమీక్ష సమావేశంలో రాష్ట్రంలోని ప్రాజెక్టుల పురోగతిని సమీక్షించారు. వచ్చే డిసెంబర్ నాటికి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తవుతున్న సందర్భంగా ప్రాజెక్టుల నిర్మాణాలను వేగవంతం చేయాలని అధికారులను ఆయన సూచించారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును కొనసాగిస్తామని, ప్రాజెక్టు పూర్తికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు. తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. అలాగే సమ్మక్క-సారక్క ప్రాజెక్టుకు ప్రాధాన్యత ఇస్తున్నామని ఆయన తెలిపారు. ఇందులో భాగంగా ఈ నెల 23న ఢిల్లీలో జరిగే కేంద్ర జలవనరుల సంఘం సమావేశానికి హాజరై నీటి కేటాయింపులతో పాటు టెక్నికల్ అడ్వైజరీ కమిటీ నుండి అనుమతులు తీసుకోవాలని, అదేవిధంగా మిగతా 2లో..




2

## ఎరువుల విషయంలో తెలంగాణపై వివక్ష

- ఎరువుల తయారీ సరఫరాపై పూర్తిగా కేంద్ర ఆధిపత్యం
- రాష్ట్రానికి కావాల్సిన ఎరువులలో సగం కూడా సరఫరా కాలేదు
- రాజకీయ కక్షతో రైతులను లక్ష్యంగా చేసుకుంటున్నారు
- మంత్రి పొన్నం ప్రభాకర్



2

## నిరుద్యోగ రేటు 2% మాత్రమే

- జీ20 దేశాలతో పోలిస్తే ద భారతదేశంలో అత్యల్ప నిరుద్యోగం
- ఎన్ సిఎస్ పోర్టల్ ద్వారా 7.22 కోట్ల ఉద్యోగ అవకాశాలు అందుబాటులో
- గ్రామీణ, వెనుకబడిన ప్రాంతాల యువతకు ప్రత్యేక ప్రయోజనాలు
- కేంద్ర మంత్రి మన్సుఖ్ మాండవీయ

## కాంగ్రెస్ బీసీ డిక్లరేషన్

# విస్మరించింది

- రాహుల్, ప్రియాంక గాంధీకి పార్లమెంటులో సమాధానం చెప్పాలి
- బీసీ రిజర్వేషన్ల కోసం పటిష్ట పోరాటం
- బంజారాహిల్స్‌లో 70కి పైగా బీసీ సంఘాల నేతలతో సమావేశం
- జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత




హైదరాబాద్, సెప్టెంబర్ 8-(తొలి క్రాంతి):

జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత బీసీలకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడం పై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల సాధన మాత్రమే లక్ష్యంగా పెట్టి అందుకు ముందుకు ఉమ్మడి ఉద్యమ కార్యాచరణ చేపట్టాలని ఆమె స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో బంజారాహిల్స్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో 70కి పైగా బీసీ కుల సంఘాల నాయకులతో సమావేశమయ్యారు. సమావేశంలో బీసీ రిజర్వేషన్ల సాధన కోసం అనుసరించాల్సిన వ్యూహాలను ప్రధానంగా చర్చించారు. కవిత మాట్లాడుతూ ఎన్నికల ముందు మిగతా 2లో..




# రైతులకు అండగా ఉండండి



2

- ఆస్తుల తాకట్టు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేయాలని రైతులను ఒత్తిడి చేయవద్దు
- రైతుల కోసం రూ.30వేల కోట్ల రుణాలు జమ బ్యాంకింగ్ రికవరీలో రికార్డ్
- రుణమాఫీ, రైతు భరోసా, ఉచిత విద్యుత్‌తో వ్యవసాయ రంగానికి ఊతం
- డిప్యూటీ సీఎం భట్టి



## 21 నుంచి పాఠశాలలకు సెలవులు

- అక్టోబర్ 3 వరకు కొనసాగనున్న సెలవులు
- తెలంగాణలో విద్యార్థులకు దసరా సెలవులు ఖరారు

2

# కడుపులో విషం పెట్టుకుని ప్రాజెక్టులు ఆపొద్దు

(మొదటి పేజీ తరువాయి)

జలాలను తరలించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత పదేళ్లలో కృష్ణా, గోదావరి నదుల నుంచి చుక్క నీరు కూడా నగరానికి తరలించలేదని విమర్శించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే గోదావరి జలాలను తరలించి తాగునీటి సమస్యను పరిష్కరించడమే కాకుండా మూసీ కాలుష్యాన్ని నివారించే కార్యక్రమాన్ని చేపట్టామని స్పష్టం చేశారు. గోదావరి తాగునీటి సరఫరా పథకం, ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ జలాశయాలను నింపడం ద్వారా మూసీ నది పునరుజ్జీవ ప్రాజెక్టుకు గండిపేట వద్ద శంకుస్థాపన చేశారు. దాదాపు ₹7,360 కోట్ల వ్యయంతో రెండేళ్లలో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్న ఈ ప్రాజెక్టులో గోదావరి నది నుంచి 20 టీఎంసీల నీటిని తరలించనున్నారు. అందులో జంట నగరాల తాగునీటి అవసరాల కోసం 17.50 టీఎంసీల నీటిని ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ జలాశయాలను నింపేందుకు, మరో 2.50 టీఎంసీల నీటిని మూసీ నది పునరుజ్జీవనానికి కేటాయించారు. ఈ ప్రాజెక్టుకు మూలంగా శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టును తీసుకున్నామని, అక్కడి నుంచి నీటిని తరలిస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. మూసీ నది మురికి కూపంగా మారి విషంగా మారిందని, దీనివల్ల ఎల్బీనగర్, ఇబ్రహీంపట్నం, భువనగిరి, ఆలేరు ప్రాంతాల్లో నీరు తాగితే మనుషులే కాదు, పశువులు కూడా ప్రాణాలు కోల్పోతున్నాయని పేర్కొన్నారు. పుట్టబోయే శిశువులు కూడా అంగవైకల్యంతో జన్మిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గుజరాత్‌లో సబర్మతీ, ఉత్తరప్రదేశ్‌లో గంగా, ఢిల్లీలో యమునా నదుల ప్రక్షాళన జరిగితే, నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలకు సంబంధించిన మూసీ నది ఎందుకు శుభ్రపరచకూడదని ప్రశ్నించారు. ఆ జిల్లా ప్రజలతో కలిసి నడిస్తే ఎలాగైనా సరే మూసీని పునరుజ్జీవింపజేస్తామని, ఆరోజు ఇచ్చిన మాటను నెరవేరుస్తామని అన్నారు. గోదావరి జలాలను తరలించే ఈ కార్యక్రమం ద్వారా జంట నగరాల తాగునీటి సమస్యను పరిష్కరించడమే కాకుండా, నల్గొండ జిల్లా ప్రజలకు కూడా ఉపశమనం కల్పిస్తామని చెప్పారు. మూసీలో కలుషిత జలాలు హైదరాబాద్ ఫ్యాక్టరీల వల్ల కలవకుండా నియంత్రించి నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. గోదావరి జలాలను తరలించే ప్రాజెక్టుకు సంబంధించిన శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులో తుమ్మడిహెట్టి వద్ద 152 మీటర్ల ఎత్తులో ప్రాజెక్టును చేపట్టాలని ప్రతిపాదించామని, మహారాష్ట్ర ప్రభుత్వం 142 మీటర్ల వరకు అభ్యంతరం చెప్పడం లేదని తెలిపారు. త్వరలో మహారాష్ట్ర ముఖ్యమంత్రితో చర్చలు జరిపి, మధ్యంతరంగా 148%-%150 మీటర్ల వరకైనా ఒప్పించి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో లక్షన్నర నుంచి రెండు లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. గతంలో సంకల్పించినట్టు చేవెళ్ల, వికారాబాద్, తాండూరు, పరిగి వరకు గోదావరి జలాలను తరలించి రైతాంగాన్ని ఆదుకుంటామని చెప్పారు. బుద్వేల్ ప్రాంతాన్ని అద్భుతమైన హబ్‌గా అభివృద్ధి చేస్తామని, గేట్ వే ఆఫ్ హైదరాబాద్ కోసం ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేశామని వెల్లడించారు. ఇది రాజకీయాలకు అతీతంగా చేపట్టిన అభివృద్ధి కార్యక్రమమని, అందరూ కలిసి ముందడుగు వేయాలని ఆయన పిలుపునిచ్చారు. మూసీ నది మురికికూపంగానే ఉండాలని తాను భావించడం లేదని, గంగా, యమునా, సబర్మతీ నదులు మాత్రమే ప్రక్షాళన కావాలా అని కేంద్రాన్ని నిలదీశారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ మూసీ ప్రక్షాళన గురించి ఎందుకు ఆలోచించలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్‌కు మంచి పేరు వస్తుందనే భయంతోనే బీఆర్ఎస్ ప్రతిఘటిస్తోందని పేర్కొన్నారు. అయితే, కడుపులో విషయాన్ని దాచుకుని ప్రాజెక్టులను ఆపొద్దని, హైదరాబాద్ మరింత అభివృద్ధి చెందేందుకు కలిసి రావాలని పిలుపునిచ్చారు.



## 100 రోజుల్లో మేడారం జాతర పనులు పూర్తి చేయాలి

హైదరాబాద్, సెప్టెంబర్ 8-(తొలి క్రాంతి):

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మేడారం బాసర ఆలయాల అభివృద్ధి ప్రణాళికలను సమీక్షించారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బాసర ఆలయాల అభివృద్ధిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రతిపాదిత అభివృద్ధి పనులకు సంబంధించిన మాస్టర్ ప్లాన్‌ను అధికారులు ముఖ్యమంత్రికి సమర్పించారు. రాబోయే మేడారం మహా జాతరకు ముందు మేడారం ఆలయాన్ని భక్తులకు తగిన సౌకర్యాలతో అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. 100 రోజుల్లోపు అభివృద్ధి పనులను పూర్తి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. సమీక్ష సందర్భంగా ముఖ్యమంత్రి అనేక డిజైన్ ప్రతిపాదనలను పరిశీలించి పూర్తిగా సహజ రాతి నిర్మాణాన్ని ఉపయోగించి నిర్మాణాలు నిర్మించాలని నొక్కి చెప్పారు. భక్తుల సౌకర్యార్థం సరైన ప్రవేశ నిష్క్రమణ, పార్కింగ్ ఏర్పాట్ల అవసరాన్ని కూడా ముఖ్యమంత్రి నొక్కి చెప్పారు. భవిష్యత్ అవసరాలను పరిగణనలోకి తీసుకుని వివిధ ప్రాంతాలలో నీటి నిలుపుదల ఉండేలా జంపన్న వాగుపై చెక్ డ్యామ్‌ల నిర్మాణాన్ని ప్లాన్ చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయి తనిఖీ కోసం ఈ వారం తాను స్వయంగా మేడారం సందర్శిస్తానని అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. బాసర జ్ఞాన సరస్వతి ఆలయానికి సంబంధించి, దాని విస్తరణ మరియు సమగ్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి చర్యలు సూచించారు. అన్ని ఆలయ అభివృద్ధి కార్యక్రమాలు స్థానిక మనోభావాలను గౌరవించాలని మరియు స్థానిక నిపుణులు మరియు పూజారుల అభిప్రాయాలను చేర్చాలని ఆయన నొక్కి చెప్పారు. మంత్రులు కొండ సురేఖ, సీతక్క, రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, లక్ష్మణ్, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాస్ రాజు, ఎండోమెంట్స్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ మరియు ఇతర సీనియర్ అధికారులు సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు.

# నిరుద్యోగ రేటు 2% మాత్రమే

హైదరాబాద్, సెప్టెంబర్ 8-(తొలి క్రాంతి):




కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ సోమవారం ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో పేర్కొన్నారు భారతదేశం ఉద్యోగ కల్పనలో అద్భుతమైన ప్రగతిని సాధించిందని. ప్రపంచ ఆర్థిక వేదిక (వోర్ద్ ఎకనామిక్ ఫోరమ్) విడుదల చేసిన 'ది ఫ్యూచర్ ఆఫ్ జాబ్స్ రిపోర్ట్ 2025' ప్రకారం, దేశంలో నిరుద్యోగ రేటు కేవలం 2% గా నమోదైందని ఆయన వెల్లడించారు. మాండవీయ వివరాల ప్రకారం, ప్రపంచంలోని ప్రధాన ఆర్థిక వ్యవస్థలైన %+%20 దేశాలతో పోలిస్తే, భారత దేశంలో నిరుద్యోగ రేటు అత్యల్పంగా ఉంది. అయితే, దేశ ఆర్థిక వృద్ధికి అనుగుణంగా అన్ని రంగాల్లో ఉపాధి అవకాశాలు గణనీయంగా పెరిగాయని, ప్రభుత్వ పథకాలు ఇందుకు ముఖ్యంగా దోహదపడుతున్నాయని మంత్రి చెప్పారు. యువతకు ఉపాధి అవకాశాలను మెరుగుపర్చేందుకు జాతీయ కెరీర్ సర్వీస్ పోర్టల్ ద్వారా 'మెంటర్ టుగెదర్' మరియు 'క్విక్కర్' సంస్థలతో అవగాహన ఒప్పందాలు కుదుర్చినట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం ఎన్‌సిఎస్ పోర్టల్‌లో దాదాపు 52లక్షల కంపెనీలు, 5.79 కోట్ల మంది ఉద్యోగార్థులు రిజిస్టర్ అయ్యారని, ఇప్పటివరకు 7.22 కోట్ల ఉద్యోగ అవకాశాలు అందుబాటులోకి తెచ్చినట్లు చెప్పారు. ప్రస్తుతానికి 44 లక్షలకి పైగా ఉద్యోగాలు యాక్టివ్‌గా ఉన్నాయి. ఉద్యోగ సమాచారాన్ని అందించడమే కాకుండా, ఉపాధికి సంబంధించిన అన్ని సేవలను ఒక్క వేదిక ద్వారా అందిస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు. మాండవీయ ముఖ్యంగా ప్రస్తావించిన విషయం, ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన వెంటనే యువతకు పెద్దపీట వేసిందని. యువతలో నైపుణ్యాన్ని పెంపొందించడం, ఉపాధికి అవకాసాలను సృష్టించడం కోసం రూ.2లక్షల కోట్ల బడ్జెట్తో ఐదు ప్రధాన పథకాలను ప్రకటించారన్నారు. ప్రధాన మంత్రి వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన కోసం రూ.99,446 కోట్లను కేటాయిస్తూ, రాబోయే రెండేళ్లలో 3.5 కోట్ల ఉద్యోగాలు సృష్టించడం లక్ష్యంగా ఉందని చెప్పారు. వీటిలో 1.92 కోట్ల మంది తొలిసారిగా ఉద్యోగాల్లో చేరే యువత ఉంటారని కూడా పేర్కొన్నారు. కొత్తగా కుదుర్చు కున్న ఒప్పందాల ద్వారా ఉద్యోగార్థులకు మరిన్ని ప్రయోజనాలు చేకూరతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. 'మెంటర్ టుగెదర్' భాగస్వామ్యంతో, మొదటి ఏడాదిలో 2 లక్షల మంది యువతకు వ్యక్తిగత కెరీర్ మార్గ దర్శ కత్వం అందించనున్నారు. అలాగే, 'క్విక్కర్' ఒ ప్పందం ద్వారా దేశవ్యాప్తంగా 1,200 నగరాల నుంచి రోజూ 1,200కు పైగా ఉద్యోగ ప్రకటనలు పోర్టల్‌లో అందుబాటులో ఉంచనున్నారు.

## రైతులకు అండగా ఉండండి

హైదరాబాద్, సెప్టెంబర్ 8-(తొలి క్రాంతి):

బ్యాంకర్ల సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పాల్గొని, తెలంగాణ అభివృద్ధిలో బ్యాంకర్ల పాత్ర ఎంతో కీలకమైనదని, వారి సేవలు అభినందనీయం అని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర తలసరి ఆదాయం రూ.3.87 లక్షలుగా పెరిగి దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందని, వ్యవసాయం, పారిశ్రామిక, సేవా రంగాల్లో రాష్ట్రం ముందంజలో ఉందని ఆయన వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగంపై ప్రత్యేక దృష్టి సారించి, రైతుల కోసం రుణమాఫీ, రైతు భరోసా, ఉచిత విద్యుత్ వంటి పథకాలను అమలు చేస్తోందన్నారు. వీటితో వ్యవసాయ భాగస్వామ్యం పెరిగిందని, ఎఫ్‌సీఐకి అత్యధికంగా ధాన్యం సరఫరా చేస్తున్న రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని చెప్పారు. వార్షిక రుణ ప్రణాళికలో మొదటి క్వార్టర్ లోనే 33.64 శాతం సాధించడం కూడా అభినందనీయమని అన్నారు. వ్యవసాయ రంగం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకలాంటిదని పేర్కొన్న ఆయన, రైతుల పక్షాన రూ.30వేల కోట్లు బ్యాంకులకు జమ చేయడం బ్యాంకింగ్ రికవరీ చరిత్రలో కొత్త రికార్డుగా నిలిచిందని తెలిపారు. అలాగే, చిన్నా, భారీ తరహా పరిశ్రమల వృద్ధిని ప్రోత్సహిస్తూ, బిజినెస్ ఫ్రెండ్లీ ప్రభుత్వంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. రైతులకు సకాలంలో రుణాలు అందించాలనీ, అయితే ఆస్తుల తాకట్టు లేదా ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేయాలని ఒత్తిడి చేయవద్దని సూచించారు. బ్యాంకర్లు మానవీయ కోణంలో ఆలోచించాలని, రైతులను కష్టాల్లో పెట్టకుండా సహకరించాలని కోరారు.

## కాళేశ్వరం తెలంగాణకు కల్పతరువు

(మొదటి పేజీ తరువాయి)

రిజర్వాయర్ కాదు, కాలువ కాదు-అది తెలంగాణ అభివృద్ధికి వెన్నెముక" అని పేర్కొన్నారు. కాళేశ్వరం ద్వారా నిర్మించిన మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్, రంగనాయక సాగర్, అనంతగిరి రిజర్వాయర్, గంధమల్ల, బస్వాపూర్, మిడ్ మానేరు, రాజరాజేశ్వర సాగర్, ఎస్సారెస్పీ పునరుజ్జీవ ప్రాజెక్టులతో పాటు 3 బ్యారేజీలు, 15 రిజర్వాయర్లు, 19 సబ్ స్టేషన్లు, 21 పంపింగ్ స్టేషన్లు, 203 కిలోమీటర్ల సొరంగ మార్గం, 1531 కిలోమీటర్ల గ్రావిటీ కాలువలు, 98 కిలోమీటర్ల ప్రెజర్ మెయిన్స్, 141 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం, సముద్ర మట్టానికి 530 మీటర్ల ఎత్తుకు నీటిని ఎత్తిపోసే వ్యవస్థను అభివర్ణించారు. సుంకిశాల రిటైనింగ్ వాల్ కూలిన ఘటనకు కారణమైన కాంట్రాక్ట్ కంపెనీని హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ బ్లాక్ లిస్ట్ చేసినా, అదే కంపెనీకి రూ.7,000 కోట్ల పనులు కట్టబెట్టడం ఎలా న్యాయమని ప్రశ్నించారు. అదే కంపెనీ నిర్మిస్తున్న ఎన్‌హెచ్ 66 స్లోప్ ప్రొటెక్షన్ వాల్ కూలడంతో నేషనల్ హైవే అథారిటీ బ్లాక్ లిస్ట్ చేసినట్లు గుర్తుచేశారు. సొంత నియోజకవర్గమైన కొడంగల్‌లో రూ.4,000 కోట్ల లిఫ్ట్ ఇరిగేషన్ పనులను కూడా అదే కంపెనీకి ఇవ్వడం క్రిమినల్ కుట్రకు సమానమని ఆరోపించారు. ఇలాంటి కంపెనీలకు మూసీ సుందరీకరణ ప్రాజెక్టును అప్పగించడానికి సీఎం రేవంత్‌రెడ్డి ఆత్రంగా ఉన్నారని, కానీ మహిళలకు తులం బంగారం, నెలకు రూ.2,500, వృద్ధులకు పెన్షన్ వంటి సంక్షేమ పథకాలకు మాత్రం ఆసక్తి చూపడం లేదని ఎద్దేవా చేశారు. రూ.16,000 కోట్లతో పూర్తయ్యే ప్రాజెక్టును రూ.1,50,000 కోట్లకు పెంచి దోచుకునేందుకు కుట్ర జరుగుతోందని పేర్కొన్నారు. హైదరాబాద్‌కు తాగునీటి కొరత రాకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకున్న చర్యలను వివరించారు. ఔటర్ రింగ్ రోడ్డు చుట్టూ 50 కిలోమీటర్ల మేర రింగ్ మెయిన్ నిర్మించామని, మళ్లీ అధికారంలోకి వస్తే 24 గంటల నల్లా నీటి సరఫరాను అందిస్తామని హామీ ఇచ్చారు. జీహెచ్ఎంసీ ఎన్నికల తర్వాత ఉచిత తాగునీటి పథ కాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేయబోతుందని కూడా ఆరోపించారు అలాగే, ఆర్ఆర్ టాక్స్ వసూలుపై ప్రధానమంత్రి ఆరోపించినా బీజేపీ చర్యలు తీసుకోకపోవడం ఏమిటని ప్రశ్నించారు. హైదరాబాద్‌కు న్యాయం చేయగలిగేది కేసీఆర్, బీఆర్ఎస్ మాత్రమేనని స్పష్టం చేశారు.

# మట్టి భాషను నెత్తికెత్తిన కాళోజీ

**అన్యాయాన్నెదిరిస్తే**
**నాగొడవకు సంతృప్తి**
**అన్యాయం అంతరిస్తే**
**నా గొడవకు ముక్తి ప్రాప్తి**
**అన్యాయాన్నెదిరించినోడు**
**నాకు ఆరాధ్యుడు...**

తెలంగాణ నేలకు పోరాట స్ఫూర్తి నేర్పిన కలం గళం కాళోజి..1914 సెప్టెంబర్ 9న జన్మించిన కాళోజీ తెలంగాణా భాషా ప్రభంజనం.. ఉర్దూ హిందీ మరాఠీ కన్నడ ఆంగ్లభాషలపై సాధికారత ఉన్న తెలుగు భాషపై ఆయన చూపిన మమకారం అత్యంత శ్లాఘనీయం.. ఆయన కలం ఒక ప్రచండ శక్తి. తెలంగాణ ప్రజల వ్యధాభరిత జీవితాలను సిరాగా చేసుకుని ఒక మహా విప్లవాన్ని సృష్టించి చరిత్రలో చిరస్మరణీయంగా నిలిచిపోయాడు కాళోజి.

ఉదయం కానే కాదనుకోవడం నిరాశ..
ఉదయం అలానే ఉండాలనుకోవడం దురాశ..

ఆనాటి నిజాం ప్రభుత్వంపై తన అక్షర పాశుపతాస్త్రం సంధించి తెలంగాణ ప్రజలను జాగృతం చేసిన మహాకవి కాళోజి.

**బడి పలుకుల భాష కాదు నాది**
**పలుకుబడుల భాష నాది**
**నా భాష తెలుగు భాష...**

అంటూ తెలంగాణ భాష యాసలకు ప్రపంచ ఖ్యాతిని ఆర్జించి పెట్టిన యుగకర్త కాళోజి. సమస్త మానవాళికి భాష ఆత్మ అని బలంగా నమ్మిన కాళోజి తెలంగాణ గడ్డకు భాషకు ఉన్న ఆత్మానుబంధాన్ని తొలిగా తెలిపిన ప్రజాకవి. ఎక్కడో కన్నడ దేశంలో జన్మించి తెలంగాణా నడిబొడ్డు లోని వరంగల్ జిల్లా మడికొండను కేంద్రంగా చేసుకుని తన గొడవను తెలంగాణా గొడవగా మార్చి నా గొడవ అంటూ తెలంగాణా ప్రజలలో ఉద్యమస్ఫూర్తిని నింపి ప్రత్యేక రాష్ట్ర సాధనకు ఊపిరి పోశాడు.



**ఏ భాష నీది ఇది ఏమి వేషం రా**
**ఈ భాష ఈ వేషం ఎవరికోసం రా**
**ఆంగ్ల మందున మాట అనగానే**
**ఇంత కులుకు ఎందుకురా**
**తెలుగు వాడవై తెలుగు రాదనుచు**
**సిగ్గు లేక ఇంక చెప్పుటెందుకు రా**
**అన్య భాషలు నేర్చి ఆంధ్రమ్ము రాదంచు**
**సకిలించు ఆంధ్రుడా చావవెందుకురా**

అంటూ పరాయి భాషలో మోజులో కన్నతల్లి వంటి మాతృభాషను నిర్లక్ష్యం చేస్తున్న వారిని అక్షర నిప్పులతో కడిగి పారేశాడు కాళోజీ.

పుట్టుక నీది..చావు నీది... బ్రతుకంతా దేశానిది

స్వాతంత్ర ఉద్యమంలో ఆనాటి ప్రజల దృఢమైన సంకల్పం, నిబద్ధత ఈనాటి తెలంగాణ ప్రజలలో రావాలని అప్పుడే మన నేల మన మట్టి మన భాష మన సంస్కృతి మన సాంప్రదాయం కాపాడుకోగలమని నిరంతరం తన గోసను వినిపించిన వాడు కాళోజీ. స్వాతంత్ర సమర యోధుడిగా మాడపాటి హనుమంతరావు, సురవరం ప్రతాపరెడ్డి, జమలాపురం కేశవరావు, బూర్గుల రామకృష్ణారావు, పీవీ నరసింహారావులతో కలిసి సత్యాగ్రహోద్యమంలో పాల్గొన్న కాళోజి ఆ ఉద్యమ స్ఫూర్తి తోనే ఆనాటి నిజాం సర్కార్ రజాకార్లపై తిరుగుబాటుతో తరువాతి కాలంలోని తెలంగాణ రాష్ట్ర ఉద్యమానికి నాయకులకు ప్రజలకు స్ఫూర్తిగా నిలిచాడని స్పష్టంగా చెప్పవచ్చు.

మూడు కోట్ల మేటి ప్రజల గొంతొక్కటి
కోర్కొక్కటి తెలంగాణ వెలసి నిలిచి
ఫలించాలో భారతాన... అని వాంఛించాడు..

**జరిగిందంతా చూస్తూ**
**ఎరగనట్లు పడి ఉండగ**
**సాక్షీభూతున్ని గాను**
**సాక్షాత్తూ మానవున్ని...**

అంటూ అటు బ్రిటిష్ వాళ్ళను ఇటు రజాకార్లను నిరసించాడు. భగవంతుడు అవతారాలు ఎత్తి ఎత్తి విసుగు పుట్టి మనిషిగా పుట్టాడని చెబుతూ అసాధ్యాలను సుసాధ్యం చేయగల ఏకైక శక్తి మనిషి మాత్రమేనని అందరిలో ఆశావాహ దృక్పథాన్ని నింపిన యుద్ధనౌక కాళోజీ..

**బ్రతికున్న పాము**
**ఎక్కడ బుస్సని పడగ విప్పుతుందోనని**
**పగబట్టి కాటేస్తుందని**
**ఆపాద మస్తకం వణికి పోతూ**
**నాగ స్వరాల ఆసరాతో మెప్పిస్తూ**
**పూజిస్తూ నాగులచవితి మొక్కుబళ్ళు చెల్లిస్తూ**
**చచ్చినపామును బడితల్తో బాది**
**నిరసన జూపి, భర్త్సన జరిపి**
**విషనాగుల్ని చితక పొడవాలె**
**అని నినదించే మనిషి ఏం మనిషి**

అధికారానికి భజన చేసే వాళ్ళు తప్పించుకు తిరిగే మోసగాళ్ళు అంటూ అణగదొక్కుతున్న నాయకుల్ని నిరసించాలన్న కాళన్న...మనల్ని మనం మోసం చేసుకుంటూ ఎంత కాలం బ్రతుకుతాం అంటూ అని నిలదీసాడు. రాసే భాష మాట్లాడే భాష ఒకేలా ఉండాలనే నినాదంతో తెలంగాణ భాషకు అస్తిత్వాన్ని కల్పించిన మహాకవి కాళోజి. నా గొడవ,అణా కథలు, జీవన గీతి,ఇదీ నా గొడవ, బాపూ.. బాపూ.. బాపూ.. తెలంగాణ ఉద్యమ కథలు నా భారత దేశ యాత్ర వంటి రచనలతో తెలంగాణ భాషను ఇంటి భాషగా మార్చాడు..

**"ఒక్క సిరా చుక్క లక్ష మెదళ్ళకు కదలిక"**

ఈ ఒక్క వాక్యంతోనే కాళోజి విశ్వ చైతన్య స్ఫూర్తికి పునాదిగా నిలిచాడు.

**ఎరుగుదువా నేస్తం**
**ఎన్ని మొద్దు బ్రతుకుల**
**ముద్దులు ముచ్చట్లు**
**రంపపు కోతల పాలైతే**
**మన ముద్దు ముచ్చట్లు"..**

ప్రజలందరినీ తన నేస్తాలుగా భావించి ఎన్నో యాతనలు, అగచాట్లు, జీవితం చట్రంలో నలిగిపోతేనే మన సుఖం మన క్షేమం అంటూ స్వేచ్ఛకై పోరాడాల్సిందే అని హితవు పలికిన ఉద్యమ స్ఫూర్తి కాళన్న. తెలంగాణ భాషకు సంస్కృతికి సంప్రదాయాలకు చిహ్నంగా తెలంగాణ ప్రజల గుండె గోస యాసను అక్షరబద్ధం చేసి తెలంగాణ సాహిత్యానికి పట్టాభిషేకం చేసిన మహాకవి యువ కర్త పద్మ విభూషణ్ కాళోజీ పేరిట 'తెలంగాణ భాషా దినోత్సవాన్ని' జరుపుకోవడం తెలంగాణ రాష్ట్రానికి అతిపెద్ద పండుగ...



అట్లూరి వెంకటరమణ
కవి, రచయిత-ఖమ్మం



## కాంగ్రెస్ బీసీ డిక్లరేషన్ విస్మరించింది

(మొదటి పేజీ తరువాయి)

కామారెడ్డిలో ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌ను కాంగ్రెస్ పార్టీ పూర్తిగా విస్మరించిందని, బీసీల రిజర్వేషన్ల అంశాన్ని రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ ఇప్పటివరకు పార్లమెంటులో ఎందుకు ప్రస్తావించ లేదో తెలంగాణ ప్రజలకు సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీసీల పట్ల కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి లేదని ఆమె తీవ్రంగా దుయ్య బట్టారు. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో బీసీలకు 42శాతం రిజర్వేషన్లను చట్టబద్ధంగా కల్పించాలని ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అన్ని బీసీ సంఘాలను కలుపుకొని, రిజర్వేషన్ల సాధన కోసం ఉమ్మడి ఉద్యమంతో ముందుకు సాగుతామని తెలిపారు. 42 శాతం రిజర్వేషన్ల లక్ష్యం నెరవేరే వరకు పోరాటం ఆగదని కవిత తేల్చిచెప్పారు.

## ప్రాణహిత-చేవెళ్లకు ప్రాధాన్యత

(మొదటి పేజీ తరువాయి)

ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వంతో చర్చించి అవసరమైన అనుమతులు పొందాలని అధికారులకు సూచించారు. సీతారాంసాగర్, మోడికుంటవాగు, చనాకా/కొరాట డిస్ట్రిబ్యూటరీ సిస్టం, చిన్న కాళేశ్వరం ప్రాజెక్టుల నిర్మాణాలకు కావాల్సిన నిధులను కేంద్ర ప్రభుత్వం నుండి విడుదల చేసేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆయన చెప్పారు. కృష్ణా జలాల వివాదానికి సంబంధించిన వివిధ ట్రిబ్యునల్ విషయంపై సుప్రీంకోర్టులో ఈ నెల 23, 25న వాదనలు ఉన్నందున అంతకుముందే సుప్రీంకోర్టు న్యాయవాది సీఎస్ వైద్యనాథ్‌తో చర్చలు జరగనున్నట్లు తెలిపారు. జాతీయ డ్యామ్‌ల పరిరక్షణ సంస్థ (ఎన్‌డీఎస్ఏ) సూచనలకు అనుగుణంగా మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను పునరుద్ధరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన చర్యలు తీసుకుంటుందని మంత్రి పేర్కొన్నారు. ట్రిపుల్ ఐటీ వంటి సంస్థల సహకారంతో నిర్మాణానికి సంబంధించిన అంశాలను పరీక్షించేలా చర్యలు చేపట్టాలని, వరదలు తగ్గిన వెంటనే పనులు ప్రారంభించేందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించా లని సూచించారు. వచ్చే సంవత్సరం వానాకాలంలోపు పనులు పూర్తి చేయాలని అధికారులకు ఆయన ఆదేశించారు. అదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న భూసేకరణ, పునరావాసంతో పాటు

## ఎరువుల విషయంలో తెలంగాణపై వివక్ష

హైదరాబాద్, సెప్టెంబర్ 8-(తొలి క్రాంతి):

రాష్ట్రంలో ఎరువుల సమస్య తీవ్రమై రైతులు ఆందోళనలో ఉన్నారు. ఎరువుల తయారీ సరఫరాపై పూర్తిగా కేంద్ర ప్రభుత్వ ఆధిపత్యమే ఉందని ఎరువుల కొరతకు కేంద్రమే కారణమని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. గాంధీ భవన్ లో మీడియాతో మాట్లాడిన ఆయన ఎరువుల విషయంలో తెలంగాణ పట్ల కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపుతోందని మండిపడ్డారు. రాష్ట్రానికి అవసరమైన 11 లక్షల టన్నుల ఎరువులకు గాను కేవలం 5.2 లక్షల టన్నులే సరఫరా అయ్యాయని దీనికి కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాల్సిందేనన్నారు. రాజకీయ కక్షతో రాష్ట్ర ప్రభుత్వం, ప్రజాప్రతినిధులపై కాకుండా రైతులపై ప్రభావం చూపించే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. రైతుల్లో రాష్ట్ర ప్రభుత్వంపై వ్యతిరేకత రావాలని బీజేపీతో బీఆర్ఎస్ కుమ్మక్కై ఉద్దేశపూర్వకంగా కుట్ర చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. రామగుండం ఎరువుల కర్మాగారంలో ఉద్దేశపూర్వకంగానే గత నాలుగు నెలలుగా ఉత్పత్తి నిలిచిపోయిందని అక్కడే ఎరువులను తయారు చేసి రైతులకు అందించాలని డిమాండ్ చేశారు. క్షేత్రస్థాయిలో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, రాష్ట్ర ప్రభుత్వం చేతిలో సహకారం అందించేందుకు ఏమీ లేదని దుయ్యబట్టారు. ఎరువుల బాధ్యత వహించాల్సిన వారు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. రైతుల సహకారంతో బీజేపీపై ఒత్తిడి తేవాలని రాజకీయ కక్ష కోసం రైతులను బాధపడనీయరాదని ఆయన అన్నారు. యూరియా ఎవరిస్తే వాళ్లకు ఓటు వేయాలని కేటీఆర్ చెప్పారని అయితే కేంద్రం యూరియా ఇవ్వడం లేదని అందుకే తెలుగు బిడ్డకు బీఆర్ఎస్ సభ్యులు ఓటు వేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## మొదటి ఓటు మోదిదే

న్యూఢిల్లీ, సెప్టెంబర్8-(తొలి క్రాంతి):

ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న ఉప రాష్ట్రపతి ఎన్నిక మంగళవారం నాడు జరగనుంది. ఈ ఎన్నికల్లో ఎన్డీయే అభ్యర్థిగా సీపీ రాధాకృష్ణన్, ఇండియా కూటమి అభ్యర్థిగా బి.సుదర్శన్ రెడ్డి మధ్య ముఖాముఖీ పోరు నెలకొంది. ఉభయసభల్లోని ఎంపీలు ఉపరాష్ట్రపతిని ఎన్నుకుంటారు. రాజ్యాంగంలోని 64, 68 అధికరణలోని నిబంధనల కింద ఉపరాష్ట్రపతి ఎన్నిక జరుగుతోంది. ఈ ఎన్నికలను ఎలక్షన్ కమిషన్ నోటిఫై చేసింది. సీక్రెట్ బ్యాలెట్ పద్ధతిలో ఓటింగ్ జరగనుంది. ప్రధాని నరేంద్ర మోదీ ఈ ఎన్నికలో తొలి ఓటు వేయనున్నారు. పార్టీ వర్గాలు తెలిపినట్లుగా పంజాబ్, హర్యానా ఎంపీలతో కలిసి ప్రధాని తన ఓటు హక్కును వినియోగిస్తారని పేర్కొన్నారు. ఎన్డీయే భాగస్వాముల నుంచి సీపీ రాధాకృష్ణన్‌కు పూర్తి మద్దతు ఉందని ఎన్డీయే సీనియర్ నేత ఒకరు తెలిపారు. ఓటింగ్ సందర్భంగా ఎంపీల మధ్య పూర్తి సమన్వయం, ఐక్యత కోసం ప్రధానమంత్రి మోదీ సోమవారం రాత్రి 8 గంటలకు ఎన్డీయే ఎంపీల కోసం డిన్నర్ విందు ఏర్పాటు చేశారు. పార్టీ వర్గాల ప్రకారం, ఈ తరహా విందు సమావేశాలు సమన్వయం ఐక్యత కోసం ఎంతో ఉపకరిస్తాయి. కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు రామ్మోహన్ నాయుడు, శివసేన ఎంపీ శ్రీకాంత్ షిండేలను ఉప రాష్ట్రపతి ఎన్నికలకు ఎలక్షన్ ఏజెంట్లుగా నియమించారు. పార్లమెంటు వర్షాకాల సమావేశాల తొలిరోజు జగ్‌దీప్ ధన్‌ఖడ్ ఉపరాష్ట్రపతి పదవికి రాజీనామా చేయడంతో, ఆ పదవికి ఎన్నిక అనివార్యమైంది.

## 21 నుంచి సెలవులు

హైదరాబాద్, సెప్టెంబర్ 8-(తొలి క్రాంతి):

తెలంగాణ రాష్ట్రంలోని జూనియర్ కళాశాలలకు ఈ నెల 28వ తేదీ నుంచి దసరా సెలవులు ప్రారంభమవుతాయని రాష్ట్ర విద్యా శాఖ అధికారికంగా ప్రకటించింది. ఈ సెలవులు అక్టోబర్ 5వ తేదీ వరకు కొనసాగుతాయి. అక్టోబర్ 6నుంచి కళాశాలలు తిరిగి ప్రారంభమవుతాయని ప్రభుత్వం తెలియజేసింది. అలాగే, రాష్ట్రంలోని అన్ని పాఠశాలలకు ఈ నెల 21వ తేదీ నుంచి దసరా సెలవులు ఉంటాయి. ఈ సెలవులు అక్టోబర్ 3వ తేదీ వరకు కొనసాగుతాయి. విద్యార్థులకు దాదాపు 13 రోజుల పాటు పండగ సెలవులు లభించనున్నాయి. తెలంగాణ ప్రభుత్వం ఈ మేరకు అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది.



## దేశానికి శాస్త్రవేత్తలు కావాలి
## కలెక్టర్ జితేష్ వి. పాటిల్



**కరకగూడెం, సెప్టెంబర్ 08 తొలి క్రాంతి:**
కరకగూడెం జవహర్ నవోదయ విద్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ విద్యార్థులతో మాట్లాడుతూ దేశాభివృద్ధికి శాస్త్రవేత్తలు అత్యవసరమని చెప్పారు. వ్యక్తిగత లక్ష్యసాధనతో పాటు పరిశోధనలు చేసి సమాజ సమస్యలకు పరిష్కారాలు చూపే దిశగా ముందుకు సాగాలని సూచించారు. తరగతి గదులు, వంటశాల, మరుగుదొడ్లు, డైనింగ్ హాల్ పరిశీలించిన ఆయన పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. విద్యార్థులకు పౌష్టికాహారం, అవసరమైన సౌకర్యాలు అందేలా చూడాలని స్పష్టం చేశారు. పాఠశాల ప్రతిష్టను నిలబెట్టే బాధ్యత అందరిదని కలెక్టర్ పేర్కొంటూ, క్రీడా సామాగ్రి, లైబ్రరీ పుస్తకాలు త్వరలోనే అందజేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాల సిబ్బందితో సమావేశమై సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి భరోసా ఇచ్చారు.

## తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి కాళోజీ -నామ



**ఖమ్మం, సెప్టెంబర్ 08 తొలి క్రాంతి:**
ప్రజాకవి, స్వాతంత్ర్య సమరయోధుడు కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా ఆయనను స్మరించుకుంటూ ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి కాళోజీ కవిత్వం సాహిత్యం మాత్రమే కాక సామాజిక మార్పు సాధనమని తెలిపారు. పేదల వేదన, ప్రజల ఆశలు ప్రతిబింబించిన ఆయన రచనలు తరతరాలకు ప్రేరణనిస్తాయని గుర్తుచేశారు. సాదాసీదా జీవనంతో ప్రజల మనసుల్లో నిలిచిపోయిన మహనీయుడని, కాళోజీ కలలు సాకారం చేసే దిశగా ముందుకు సాగాలని నామ పిలుపునిచ్చారు.

## ప్రభాత కెరటాలు ఆవిష్కరణ



**అశ్వరావుపేట, సెప్టెంబర్ 08 తొలి క్రాంతి:**
అశ్వారావుపేటకు చెందిన ప్రముఖ కవి వ్రాసిన ప్రభాతకెరటాలు కవితాసంపుటి ఆవిష్కరించబడింది. ఆర్ట్ ఫౌండేషన్ అధ్యక్షులు ,ఆంధ్రప్రదేశ్ జానపద అకాడమి తొలి అధ్యక్షుడు పొట్లూరి హరికృష్ణ ఆధ్వర్యంలో హైదరాబాద్ లోని బిర్లా ఆడిటోరియంలో ఆదివారం రాత్రి జరిగిన ఆవిష్కరణ సభలో తెలంగాణా సాహిత్యఅకాడమి తొలి అధ్యక్షులు నందిని సిద్ధారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఉపయోగపడే సాహిత్యం తెచ్చిన కవి కలకాలం గుర్తుండిపోతాడని ప్రభాకరార్యుల రచనలు సమాజహితం కోరేవిగాను ఆలోచింపచేసేవిగాను ఉంటాయని అన్నారు. ప్రముఖ సాహితీవేత్త కర్నూల్ పూర్వ డి.ఐ.జి ఇక్బాల్, కేంద్రసాహిత్య అకాడమి అవార్డు గ్రహీత బాలసాహితీవేత్త నారంశెట్టి ఉమామహేశ్వరరావు, ధర్మకేతనం అధ్యక్షులు రఘువీరప్రతాప్, నేటినిజం సంపాదకులు బైసదేవదాస్, కన్నడ కవులు జోషి,రమేష్ గోపి తదితరులు పాల్గొన్నారు.







# పని చేసాం.. పైసా రాలేదు

- నాలుగు నెలల బకాయిలతో అల్లాడుతున్న కూలీలు
- పొట్ట చేత పట్టుకొని ఆర్తనాదాలు
- గిరిజనులు, మహిళలు కన్నీటి పర్యంతం

**అశ్వరావుపేట, సెప్టెంబర్ 08 తొలి క్రాంతి:**
తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధి హామీ కూలీల పరిస్థితి దయనీయంగా మారింది. రోజూ చెమటోడ్చి పనులు చేసినా, నాలుగు నెలలుగా వారికి ఒక్క పైసా కూడా రాలేదు. కూలీలు చెప్పేది ఒక్కటే – "పని చేసాం..పైసా రాలేదు". భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట మండలంలోని అనేక గ్రామాల్లో ఈ దుస్థితి తీవ్రంగా కనిపిస్తోంది. గ్రామం గ్రామం తిరిగినా కూలీల వేదనలే వినిపిస్తున్నాయి. "నాలుగు నెలలుగా కూలీలు చేస్తూ వస్తున్నాం%ా% కానీ కడుపు నింపుకునే అన్నం కూడా లేదు. ఇదెక్కడి న్యాయం?" అని వారు ప్రశ్నిస్తున్నారు.నాలుగు నెలల బకాయిలతో అల్లాడుతున్న కూలీలు ఉపాధి హామీ పథకం పేదలకు బతుకుదెరువు కావాలి. కానీ నాలుగు నెలలుగా బకాయిలు రావడం లేదని కూలీలు ఆవేదనతో రగులుతున్నారు. వందలాది మంది గిరిజనులు, మహిళలు, వృద్ధులు చేసిన పనికి ఒక్క పైసా కూడా రాక దిక్కుతోచని పరిస్థితి. పిల్లల పాఠశాల ఫీజులు, ఇంటి ఖర్చులు, ఔషధాలు అన్నీ ఆగిపోయాయి.పొట్ట చేత పట్టుకొని ఆర్తనాదాలు కూలీలు చెబుతున్నారు – పొట్ట చేత పట్టుకొని అర్ధాకలితో పనికి వెళ్తున్నామని, తిరిగి ఇంటికొచ్చాక కూడా బతుకు భారమే మిగులుతుందని. "ప్రతి రోజు కూలి కోసం కష్టపడతాం.. కానీ కడుపు నింపుకోవడం కూడా కష్టమైపోయింది. డబ్బులు ఇవ్వకపోతే మేమెలా బతుకుతాం?" అని వారు ఆర్తనాదం చేస్తున్నారు. గిరిజనులు, మహిళలు కన్నీటి పర్యంతం ప్రత్యేకంగా గిరిజన కుటుంబాలు, మహిళలు బకాయిల చెల్లింపులు ఆలస్యం కావడంతో తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. "మా బతుకే కూలిపై ఆధారపడి ఉంది. నాలుగు నెలలుగా ఒక్క రూపాయి కూడా రాకపోవడంతో మా జీవితం చీకట్లో మునిగిపోయింది" అంటూ వారు కన్నీరు మున్నీరు కారుస్తున్నారు.ప్రభుత్వం ఉపాధి హామీ



పథకాన్ని పేదల కోసం ప్రారంభించింది. కానీ నేడు ఆ పథకం కూలీలను మరింత కష్టాల్లోకి నెడుతోంది. నిధుల విడుదలలో జాప్యం, అధికారుల నిర్లక్ష్యం కూలీలను అగాధంలోకి నెట్టేసిందని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కూలీల ప్రశ్న – "పనులు చేయించుకోవడం మాత్రం త్వరగా.. డబ్బులు ఇవ్వడం మాత్రం ఎందుకు ఆలస్యం?" అని. ఇకనైనా ప్రభుత్వం తక్షణమే స్పందించి నాలుగు నెలల బకాయిలను చెల్లించాలని, పేదల బతుకులు కాపాడాలని వారు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో తమ జీవితాలు మరింత దుర్భరమవుతాయని హెచ్చరిస్తున్నారు.

# సింగరేణి ఉద్యోగులకు యోగ శిక్షణ

**భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 08 తొలి క్రాంతి:**
కొత్తగూడెం ఏరియాలో సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య రక్షణ కోసం ప్రత్యేక యోగ శిక్షణ ప్రారంభమైంది. రుద్రంపూర్ ప్రగతి వనంలో ఏర్పాటు చేసిన యోగా లాన్‌లో ఏరియా జిఎం ఎం. షాలేం రాజు, సేవా అధ్యక్షురాలు జి. మధురవాణి ప్రారంభించారు. అనుభవజ్ఞులైన శిక్షకురాలు మాధురి ద్వారా ప్రతి ఉదయం తరగతులు





నిర్వహించబడతాయి.జిఎం మాట్లాడుతూ యోగా శారీరక–మానసిక శ్రేయస్సుకు తోడ్పడుతుందని, ఉద్యోగుల ఒత్తిడి తగ్గించి పనితీరును మెరుగు పరుస్తుందని చెప్పారు. సేవా అధ్యక్షురాలు మధురవాణి కూడా యోగా నేటి జీవితంలో అవసరమని, అందరూ దీనిని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.





# రైతు పంటలతోనే అభివృద్ధి

- లాభసాటి పంటలే ఆదాయం తెస్తాయి
- బీసీ బాలుర హాస్టల్ శాశ్వతంగా నిర్మిస్తాం
- ఖమ్మం పరిధిలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**ఖమ్మం, సెప్టెంబర్ 08 తొలి క్రాంతి:**
రైతులు వరి పంటలకే పరిమితం కాకుండా ఆయిల్ పామ్, వక్క, జాజి వంటి లాభసాటి పంటలు సాగు చేసి అధిక ఆదాయం సంపాదించాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు.సోమవారం ఖమ్మం నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. వీటిలో వెనకబడిన తరగతుల బాలుర హాస్టల్ నిర్మాణానికి 3 కోట్లు, పశు వైద్యశాలకు 30 లక్షలు, ఖమ్మం నగరంలోని రహదారులు, డ్రెయినేజీ పనులకు 66 లక్షల నిధులు కేటాయించారు.మంత్రి మాట్లాడుతూ గ్రామాల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వంతో సమన్వయం చేస్తామని, విద్యతోనే శాశ్వత అభివృద్ధి సాధ్యమని తెలిపారు. కార్పొరేట్ స్థాయిలో నాణ్యతతో హాస్టల్ నిర్మాణం పూర్తి చేస్తామని




హామీ ఇచ్చారు.కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ మాట్లాడుతూ విద్యా సౌకర్యాలను విస్తరించేందుకు కృషి చేస్తామని, బీసీ హాస్టల్ నిర్మాణం నాణ్యతకు ప్రత్యేక శ్రద్ధ వహిస్తామని తెలిపారు. ప్రస్తుతం చదువుతున్న విద్యార్థుల సంఖ్యను మరింత పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.









## మహేష్ కుమార్ గౌడ్ సన్మానం

**హైదరాబాద్, సెప్టెంబర్ 08 తొలి క్రాంతి:**
టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్‌ను టీపీసీసీ జనరల్ సెక్రటరీ నాగా సీతారాములు గాంధీభవన్‌లో శాలువాతో సన్మానించారు. టీపీసీసీ అధ్యక్షుడిగా ఏడాది పూర్తయిన సందర్భంగా జరిగిన విస్తృత కార్యవర్గ సమావేశంలో ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. ప్రజల గుండెల్లో స్థానం సంపాదించిన మహేష్ కుమార్ గౌడ్ నాయకత్వం రాష్ట్రంలో పార్టీని మరింత బలోపేతం చేస్తోందని నాగా సీతారాములు అభినందించారు.

## రోకటి సురేష్ మృతి పట్ల నామ సంతాపం



**జూలూరుపాడు, సెప్టెంబర్ 08 తొలి క్రాంతి:**
జూలూరుపాడు మండలం పాపకొల్లు గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీటీసీ రోకటి సురేష్ మృతి పట్ల మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు సంతాపం తెలిపారు. ఆయన మరణం గ్రామానికి, కుటుంబానికి తీరని లోటు అని పేర్కొంటూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## సింగరేణి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



**భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 08 తొలి క్రాంతి:**
కొత్తగూడెం ఏరియాలోని వెంకటేష్ ఖని కోల్ మైన్ పర్యావరణ అనుమతులలో భాగంగా రాంపురం గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సెప్టెంబర్ 8న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు జరిగిన ఈ శిబిరంలో చక్కెర, బిపి, గుండె సంబంధిత వ్యాధులు, ఊబకాయం తదితర సమస్యలపై అవగాహన కల్పించి, నిర్ధారణ పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సింగరేణి మెయిన్ హాస్పిటల్ వైద్యులు డి.లలిత, నర్సు రెహనా బృందంతో కలిసి 50 మందికి చికిత్స అందించారు. సంక్షేమ అధికారి ఎం.డి. ఖలీల్ అహ్మద్, యూనియన్ నాయకులు ఎం.ఆర్.కే. ప్రసాద్, గోపు కుమార్, గ్రామ సెక్రటరీ డి.లలిత, గ్రామస్థులు పాల్గొన్నారు.



# చేతబడి పేరుతో క్రూర హింస

- మూఢనమ్మకంతో ముగ్గురిపై దారుణ దాడి
- ప్రాణభయంతో పారిపోయిన బాధితులు

**అశ్వరావుపేట, సెప్టెంబర్ 08 తొలి క్రాంతి:**
అశ్వరావుపేట మండలంలోని నందిపాడు గ్రామంలో మానవత్వాన్ని చీల్చివేసే ఘటన వెలుగులోకి వచ్చింది. చేతబడి చేస్తున్నారని అనుమానంతో ముగ్గురు వ్యక్తులపై గిరిజన యువకులు భయంకరమైన దాడికి తెగబడ్డారు. ఆడ మగ అనే తేడా లేకుండా ముగ్గురిని పిచ్చికుక్కను కొట్టినట్లు అమానుషంగా కొట్టిపారేశారు. నోట్లో గుడ్డలు కుక్కి ఉక్కిరిబిక్కిరి చేస్తూ ఊపిరాడకుండా హింసించారని బాధితులు వాపోయారు. బాధితుల్లో ఇద్దరు గిరిజనులు కాగా మరొకరు బీసీ వర్గానికి చెందినవారు. పూర్తిగా నిరపరాధులమైన తమపై మూఢనమ్మకాలతో దాడి



మూఢవిశ్వాసాలు ఎంతలా పెచ్చరిల్లాయో ఈ ఘటన తేటతెల్లం చేసింది. ప్రాణభయంతో అక్కడినుంచి తప్పించుకున్న ముగ్గురు బాధితులు నేరుగా పోలీస్ స్టేషన్ చేరుకుని రక్షణ కోరారు. అక్కడే పత్రిక ప్రతినిధుల ముందు తమపై జరిగిన దారుణాన్ని వివరించారు. విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ సంఘటన స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. చేతబడి పేరుతో నిరపరాధులపై జరుగుతున్న అణచివేతలపై ప్రభుత్వం, అధికారులు మేల్కొని

జరిగిందని వారు కన్నీటి ఘోష వ్యక్తం చేశారు. గ్రామంలో నిరక్షరాస్యత, అజ్ఞానం, అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.





తొలిక్రాంతి

మంగళవారం
9 సెప్టెంబర్ 2025

## ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాలపై కలెక్టర్ సమీక్ష



**భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 08 తొలి క్రాంతి:** జిల్లాలో జరగనున్న మండల, జిల్లా పరిషత్ సాధారణ ఎన్నికల నిర్వహణలో భాగంగా ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల డ్రాఫ్ట్ పై సోమవారం కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధ్యక్షతన ఐడిఓసి కార్యాలయంలో రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమీక్ష జరిగింది.కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 471 పంచాయతీలలో మొత్తం 6,69,048 మంది ఓటర్లు ఉన్నారని, వీరిలో పురుషులు 3,25,045, మహిళలు 3,43,979, ఇతరులు 24 మంది ఉన్నారని తెలిపారు. 4168 వార్డులకు గాను 4242 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని, కొత్తగా ఓటర్ల పేరు చేర్పులు నోటిఫికేషన్ కు ముందు మాత్రమే సాధ్యమని స్పష్టం చేశారు. ఎన్నికలు ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా జరగాలంటే అన్ని పార్టీలు సహకరించాలని ఆయన కోరారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, విద్యాచందన, జడ్పీ సీఈవో నాగలక్ష్మి, పార్టీ ప్రతినిధులు బాల ప్రసాద్, అనుదీప్, శ్రీనివాస్, సత్యనారాయణ, నోముల రమేష్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## లంబాడీల జోలికొస్తే ఖబర్దార్

- ఎస్టీ ఉప తెగలపై అనిశ్చితి తొలగించాలని డిమాండ్
- 14న కొత్తగూడెం లో భారీ ర్యాలీ



**పాల్వంచ టౌన్, సెప్టెంబర్ 08 తొలి క్రాంతి:** ఎస్టీ ఉప తెగల మధ్య అనిశ్చిత పరిస్థితిని తొలగించాలని లంబాడీ జిల్లా నాయకులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. 1976లో పార్లమెంట్ ఆమోదంతో ఎస్టీ జాబితాలో చేర్చబడిన లంబాడీ, ఎరుకల, యానాది పేర్లతో కూడిన జాబితాను వెంటనే సుప్రీం కోర్టులో సమర్పించాలని డిమాండ్ చేశారు.ఈ నెల 14న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో వేలాదిమంది లంబాడీ బిడ్డలతో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు లంబాడీ హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి గుగులోత్ కుశ నాయక్ తెలిపారు. తండా తండాలుగా విద్యార్థులు, సంఘాలు, ఉద్యోగులు భారీ స్థాయిలో తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు.పాల్వంచ పాత మున్సిపాలిటీ కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో కాంగ్రెస్ పార్టీ లంబాడీ నాయకులు, లంబాడీ సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవీలాల్ నాయక్, గుగులోత్ బద్రు నాయక్, ధరం సోత్ ఉపేందర్ నాయక్, భూక్య శంకర్ నాయక్, పరమేష్ నాయక్, గుగులోతు చంటి నాయక్ తదితరులు మాట్లాడారు.

## సింగరేణి కాంట్రాక్టు కార్మికుల డిమాండ్

- లాభాల్లో 20 వేల రూపాయలు ఇవ్వాలి
- వేతనాలు పెంచాలి
- పండుగ సెలవులు కల్పించాలి



**ఇల్లందు, సెప్టెంబర్ 08 తొలి క్రాంతి:** ఇల్లందులో సింగరేణి కాంట్రాక్టు కార్మికుల జేఏసీ సమావేశం జరిగింది. షేక్ యాకుబ్ షావలి, ఎస్.ఏ. నబి, భానోత్ రామ్ సింగ్ మాట్లాడుతూ, గత సంవత్సరం లాభాల్లో 5 వేల ఇచ్చారన్నారు. ఈసారి 20 వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.కాంట్రాక్టు కార్మికుల శ్రమతోనే సింగరేణి లాభాలు వస్తున్నాయని గుర్తు చేశారు. వేతనాలు పెంచి, వేతనంతో కూడిన పండుగ సెలవులు ఇవ్వాలని కోరారు.ఈ నెల 12న చలో ప్రజాభవన్ కార్యక్రమం నిర్వహించి ముఖ్యమంత్రికి వినతిపత్రం ఇవ్వనున్నట్లు ప్రకటించారు. పోస్టర్లు ఆవిష్కరించారు.

## ఇళ్లలో కలకలం తాచుపాములు పట్టిన సంతోష్

**భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 08 తొలి క్రాంతి:** లక్ష్మీదేవిపల్లి మండలం లోతువాగు గ్రామ పంచాయతీలో రజాక్ ఇంట్లోకి సోమవారం తెల్లవారుజామున తాచుపాము చేరి కలకలం సృష్టించింది. గత కొద్ది రోజులుగా కోళ్లను కరిచి చంపేస్తూ వచ్చిన పాము సోమవారం నాడు కూడా బుసలు కొడుతూ పైకి లేచింది. సమాచారం అందుకున్న ప్రాణధార ట్రస్ట్ అధ్యక్షుడు, కొత్తగూడెం స్నేక్ రెస్క్యూ నిపుణుడు జిమ్ సంతోష్ చాకచక్యంగా పట్టుకుని బంధించాడు. సాయంత్రం శ్రీనగర్ కాలనీలోని మరో ఇంట్లోనూ తాచుపాము బాత్రూంలో కనిపించడంతో సంతోష్ దానిని కూడా పట్టుకుని అడవిలో వదిలిపెట్టాడు. స్థానికులకు సర్పాల భద్రతపై అవగాహన కల్పించాడు.











# జ్ఞానం పండుగ - అశ్వరావుపేట టిఎల్ఎం మేళా

- తక్కువ ఖర్చు - ఎక్కువ జ్ఞానం
- ఉపాధ్యాయుల ప్రతిభ - విద్యార్థుల ఆశ్చర్యం
- విద్యా కళాసాగరంలో మేళ వాతావరణం









**అశ్వరావుపేట, సెప్టెంబర్ 08 తొలి క్రాంతి:** అశ్వరావుపేట మండలంలో సోమవారం విద్యా రంగానికి పండుగ వాతా వరణం నెలకొంది. తక్కువ ఖర్చుతో ఎక్కువ జ్ఞానాన్ని అందించేలా ఉపాధ్యా యులు తమ సృజనాత్మకతను ప్రదర్శించిన టిఎల్ఎం మేళా ఏజీహెచ్ఎస్ అశ్వరావుపేట పాఠశాలలో ఘనంగా జరిగింది. మండల విద్యాశాఖాధికారి ఆదేశాలతో, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుల సమన్వయంతో, పాఠశాలల ప్రధా నోపాధ్యాయులు, ఉపాధ్యాయులు కలిసికట్టుగా ఈ కార్యక్రమాన్ని విజయవం తంగా నిర్వహించారు.విద్యార్థుల బోధనను సులభతరం చేయడానికి ఉపయోగ పడే విధంగా చక్కటి, కళాత్మకమైన, ఆకట్టుకునే టిఎల్ఎమ్స్ (బోధన–అభ్యసన పరికరాలు) ను ఉపాధ్యాయులు స్వయంగా తయారుచేశారు. విద్యార్థులు కూడా తాము నేర్చుకున్న పాఠ్యాంశాలను ప్రతిరోజూ అర్థం చేసుకునేలా చిన్న చిన్న నమూనాలను రూపొందించి మేళాలో ప్రదర్శించారు.ప్రతీ స్టాల్ వద్ద ఉపాధ్యాయులు తమ టిఎల్ఎం పరికరాల వినియోగం, ప్రాధాన్యం, పాఠ్యాంశాల్లో వాటి అనుసంధానం గురించి సందర్శకులకు వివరిస్తూ నిలిచారు. గణితం నుంచి భౌతిక శాస్త్రం వరకు, సామాజిక శాస్త్రం నుంచి భాషా బోధన వరకు – ప్రతీ అంశానికి సంబంధించి తక్కువ ఖర్చుతో తయారైన వినూత్న బోధన పరికరాలు మేళా సందర్శకులను అబ్బురపరిచాయి.“తక్కువ ధరకే ఎక్కువ జ్ఞానం” అన్న భావనను ప్రతీ టిఎల్ఎం సాక్షాత్కరించింది. ఎక్కడ చూసినా ఉపా ధ్యాయుల సృజనాత్మకత, విద్యార్థుల ఆనందం కళకళలాడుతూ కనిపించింది. పండుగ వాతావరణం లో సాగిన ఈ మేళాలో నువ్వా నేనా అన్నట్టుగా ఉపాధ్యా యులందరూ ముందుకు వచ్చి తమ ప్రతిభను చాటారు. కార్యక్రమం ముగింపు సందర్భంగా మండల విద్యాశాఖ అధికారులు ప్రతిభ కనబరిచిన ఉపాధ్యాయులను, పాఠశాలలను బహుమతులతో సత్కరించారు. విద్యా రంగంలో కొత్త ఆవిష్కరణలకు ఈ మేళా ఆదర్శంగా నిలుస్తుందని ఉపాధ్యాయులు అభిప్రాయ పడ్డారు.ఈ ఘనమైన కార్యక్రమంలో మండలంలోని అన్ని పాఠశాలల ప్రధానో పాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొని, విద్యా రంగ అభివృద్ధికి తమ కృషిని అంకితం చేశారు.

## ఏటీసీ శిక్షణతో ఉజ్వల భవిష్యత్తు - కలెక్టర్ జితేష్ వి పాటిల్



**మణుగూరు, సెప్టెంబర్08 తొలి క్రాంతి:** ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను యువత అందిపుచ్చుకొని తమ భవిష్యత్తు బలోపేతం చేసుకోవాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ పిలుపునిచ్చారు. సోమవారం ఆయన మణుగూరు ప్రభుత్వ ఐటిఐ కళాశాల, ఏటీసీ సెంటర్‌ను ఆకస్మికంగా పరిశీలించారు.ఏటీసీ ద్వారా శిక్షణ పొందిన విద్యార్థులకు పారిశ్రామిక రంగంలో ఉద్యోగాలు లభించేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. శిక్షణ సమయంలో కష్టపడి చదివి సంపూర్ణ నైపుణ్యం సాధించాలని సూచించారు. కావలసిన పుస్తకాలు, పరికరాలు, సౌకర్యాలను ఉచితంగా అందిస్తామని తెలిపారు.తరువాత కలెక్టర్ గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలో ప్రారంభమైన ఎన్సిసి క్యాంపును సందర్శించారు. పది రోజులు జరిగే ఈ శిక్షణ శిబిరంలో 700 మంది పాల్గొంటున్నారని ఆయన పేర్కొన్నారు. ఎన్సిసి శిక్షణ ద్వారా క్రమశిక్షణ, నాయకత్వం, దేశ సేవ వంటి విలువలు పెరుగుతాయని వివరించారు. రథం గుట్ట వంటి సహజ సౌందర్య ప్రదేశాలను అడ్వెంచర్ క్యాంపులకు వినియోగించుకోవచ్చని, దీని ద్వారా పర్యాటకానికి ఊతం లభిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, ఎంపీఓ వెంకటేశ్వరరావు, ఐటిఐ సూపరింటెండెంట్ జ్యోతిరాణి, ఏటీవోలు జీ.వి. కృష్ణారావు, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.







## మున్నేరు పనులు వేగవంతం చేయాలి - మంత్రి తుమ్మల



- జూన్‌లోపే రిటైనింగ్ వాల్ పూర్తి చేయాలి
- గత వరదల నష్టం మళ్లీ జరగొద్దు

**ఖమ్మం, సెప్టెంబర్ 08 తొలి క్రాంతి:** అభివృద్ధి పనులు నిర్ణీత సమయంలో పూర్తయ్యేలా వేగం పెంచాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మున్నేరు రిటైనింగ్ వాల్, కేబుల్ బ్రిడ్జి, ఖిలా రోప్ వే పనులపై ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు.690 కోట్లతో 17 కి.మీ. మేర చేపట్టిన రిటైనింగ్ వాల్ లో ఇప్పటివరకు 6.4 కి.మీ. పూర్తయిందని తెలిపారు. మిగిలిన భూ సేకరణ త్వరగా పూర్తి చేసి జూన్ లోపే నిర్మాణం ముగించాలని ఆదేశిం చారు. కేబుల్ బ్రిడ్జి పనులు 180 కోట్లతో జరుగుతున్నాయి, 53 శాతం పూర్తయినట్లు తెలిపారు. వర్షాల కారణంగా మార్చి గడువు వాయిదా పడి, మే చివరికి పూర్తి కానున్నాయని చెప్పారు.29 కోట్లతో నిర్మిస్తున్న ఖిలా రోప్ వే పనులు ఈ నెలాఖరులో ప్రారంభమవుతాయని, వచ్చే జూలై నాటికి పూర్తవుతాయని పేర్కొన్నారు. ఖిలాకు రహదారి విస్తరణకు కూడా చర్యలు తీసుకుంటామని తెలిపారు.సమీక్షలో ఇరిగేషన్ ఎస్ఇ వెంకటేశ్వర్లు, ఆర్ అండ్ బి ఎస్ఇ యాకోబ్, ఆర్డీవో నర్సింహారావు, జిల్లా టూరిజం అధికారి సుమన్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.



# లంబాడీల ఆత్మగౌరవ గర్జన

- లంబాడీల ఆత్మగౌరవ గర్జన
- గిరిజన తెగల మధ్య చిచ్చు మానుకో
- 1976 ఉపతెగల జాబితాను సుప్రీంకోర్టుకు పంపించాలి
- లంబాడీల మనోభావాలను కించపరిస్తే తట్టుకోలేం



**టేకులపల్లి, సెప్టెంబర్ 08 తొలి క్రాంతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండల కేంద్రంలో సోమవారం నాడు లంబాడీల ఆత్మగౌరవ మహా ర్యాలీ ఘనంగా జరిగింది. లంబాడీ జేఏసీ ఆధ్వర్యంలో ఇస్లావత్ లక్ష్మణ్ నాయక్ అధ్యక్షతన సేవఘడ్ సేవాలాల్ మహారాజ్ గుడి నుంచి ప్రారంభమైన ర్యాలీ, ఎంపీడీఓ కార్యాలయం వద్దకు చేరుకొని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించడం ద్వారా ముగిసింది. ర్యాలీని ఉద్దేశించి గుగులోతు రాజేష్ నాయక్, లావుడియా ప్రసాద్ నాయక్ మాట్లాడుతూ ు “తెలంగాణలో లంబాడీ, గోండు, కోయ తెగల మధ్య ప్రభుత్వమే రాజకీయ ప్రయోజనాల కోసం చిచ్చు పెడుతోంది. ఈ అగ్ని ఆర్పే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే. 1976లో ఎస్టీ జాబితాలో చేర్చిన లంబాడి, ఎరుకల, యానది, ఆంద్ తెగల పేర్లను సుప్రీంకోర్టుకు సమర్పించాలి” అని గట్టిగా డిమాండ్ చేశారు.“మా ఆత్మగౌరవాన్ని కించపరచే ప్రయత్నాలు ఇక సహించము” అని లంబాడీ నాయకులు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బానోతు రమేష్ నాయక్, రవి రాథోడ్ నాయక్, సునావత్ రాంబాబు నాయక్, బానోత్ శ్రీనివాస్ నాయక్, భూక్యా మంగీలాల్ నాయక్, ధరావత్ నాగరాజు నాయక్, భూక్యా కుమార్ నాయక్, కిషన్ నాయక్, బానోత్ రామా నాయక్, మాలోత్ సురేందర్ నాయక్, బోడా పుణ్య నాయక్, బుక్య పాపా నాయక్, బాదావత్ సురేష్ నాయక్, బుక్య సైదులు నాయక్, రమేష్ నాయక్, కిషోర్ సింగ్ నాయక్, వాంకుడోత్ హాతిరాం నాయక్, మంగీలాల్ నాయక్, గణేష్ మహారాజ్, మూడ్ అనిల్ నాయక్, బానోత్ పూర్ణచందర్ నాయక్, భానోత్ శ్రీనివాస్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# గుంతలే గిలాట్లు

- రహదారే రాక్షసపు ఉరులు
- ప్రాణాలు పణంగా ప్రయాణం



**అశ్వరావుపేట, సెప్టెంబర్ 08 తొలి క్రాంతి:** అశ్వరావుపేట–సత్తుపల్లి ప్రధాన రహదారి వాహనదారుల ప్రాణాలకు ఉరులా మారింది. నారవారిగూడెం కాలనీ దాటి నర్సరీల వద్ద నుండి మందలపల్లి వరకు రహదారంతా పెద్ద పెద్ద గుంతలతో నిండిపోయి, ప్రయాణం కష్టసాధ్యమవుతోంది. మెయిన్ రోడ్డు మధ్యలోనే కనికనిపించే గుంతలు వాహనదారులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తూ, ప్రమాదాలకు కారణమవుతున్నాయి.రోజుకో వాహనం గుంతల్లో ఇరుక్కుపడి తిరగబడుతుంటే, కొందరు తీవ్రంగా గాయపడి ఆసుపత్రుల పాలవుతున్నారు. చిన్న చిన్న వాహనాలు అయితే ఈ రహదారిపై ప్రయాణించడం సాహస కృత్యమైంది. గుంతలు తాత్కాలిక అసౌకర్యం మాత్రమే కాదు, ప్రతిరోజూ రక్తపాతం సృష్టిస్తున్నాయి.”గుంతలను పూడ్చండి, మా ప్రాణాలను కాపాడండి” అంటూ వాహనదారులు మొరపెడుతున్నారు. ప్రభుత్వ ఖజానా నుంచి కోట్ల రూపాయలు రోడ్లకని కేటాయించినా, వాటి గమ్యం ఏంటో ప్రజలకు అర్థం కావడం లేదు. అధికారులు కనీసం రోడ్డు పరిస్థితులపై చూపు సారించడం లేదు.ప్రజల ప్రాణాలు పణంగా ఉన్నా అధికారుల నిర్లక్ష్యం మాత్రం అదుపు తప్పిన దోమలాగా కొనసాగుతోంది. వర్షాకాలం మొదలయ్యేలోపు ఈ గుంతలు మరింత విస్తరించే ప్రమాదం ఉండటంతో, “ఇంకెంత కాలం ఇలా?” అనే ప్రశ్న వాహనదారుల నోట వినిపిస్తోంది.





